విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నరీత్యా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతాంగం నష్టపోకుండా చూడాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.సోమవారం తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సీపీఐ బృందంతో సందర్శించి ధాన్యం కొనుగోళ్ళను పరిశీలించారు.రైతు భరోసా కేంద్రంలో అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ అధికారులు చెప్పిన సమాచారం మేరకు ఇప్పటి వరకు కేవలం 30 శాతం ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందన్నారు.ఇంకా 70 శాతం ధాన్యం రైతుల వద్దే వుందన్నారు. వర్షాలు కురిసే పరిస్థితి నెలకొన్న రీత్యా రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంట నష్ట పోకుండా రైతులకు తక్షణ సహాయమందించాలని కోరారు .తేమ శాతం ఎక్కువ వుందనే పేరుతో మద్దతు ధర తగ్గించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు.కొంతమంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు అయిన కాడికి అమ్మి నష్టపోతున్నారన్నారు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు,సికిలే పుష్పకుమారి, సీపీఐ తాడేపల్లిగూడెం ఏరియా కన్వీనర్ మండల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు కర్రి సోమేశ్వర రావు,బిందెలు తిరుపతయ్య, మద్ది సూర్య నారాయణరావు, బి.లక్ష్మీనారాయణ, యు.జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 190 వినతులు

విశాలాంధ్ర- ఏలూరు : స్పందనలో ప్రజల నుంచి అందిన అర్జీలను నకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 190 మంది అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి ఎవివి సత్యనారాయణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణలు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు అర్జీల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్పందనలో ప్రజలనుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధపెట్టి నాణ్యతగా పరిష్కరించేలా చూడాలన్నారు.

ధాన్యం ఎగుమతుల లోడును పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం గ్రామంలో ఎగుమతి అవుతున్న ధాన్యం బస్తాల లోడును సోమవారం ఏలూరు ఆర్డీవో పెంచల్ రెడ్డి పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా లేదని రైతులు ధాన్యమును రోడ్డుపై ఉంచొద్దని, వెంటనే లారీల్లో ఎగుమతులు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ట్రాక్టర్లు కూడా ధాన్యం ఎగుమతులకు అవకాశం కల్పిస్తామన్నారు. ధాన్యం దిగుబడులు ఎకరాకు సుమారు 30 నుంచి 37 వరకు దిగుబడులు వస్తున్నాయి. అధికారులు మాత్రం ఎకరానికి 30 గోనె సంచులే ఇస్తున్నారు. ఎకరాకు 37 వరకు పంట దిగుబడి రావడంతో గోనె సంచులు పెంచుతామని ఆర్డిఓ రైతులకు భరోసా ఇచ్చారు.ధాన్యం లోడు ఎగుమతులు రోజుకు ఎన్ని అవుతున్నాయని సర్పంచి మిద్దె సత్యవతి వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఉంగుటూరు తహసీల్దార్ ఏవీ రమణారావు, ఏవో బాలిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పోషణ పై శిక్షణ

విశాలాంధ్ర- పెంటపాడు : స్థానిక డిఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా విభాగం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వ ర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఆరోగ్యం పోషణ, ఆహారము అనే అంశాల మీద హెల్త్ కమ్యూ నిటీ ఆఫీసర్ డి.సుజాత, సిబ్బంది ఆధ్వ ర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. శ్యాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జె.విజయ బాబు మహిళా విభాగం నుండి డాక్టర్ జయంతి కుమారి, కుసుమకుమారి, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : మండల కేంద్రమైన లింగపాలెంలో మంచినీటిని సరఫరా చేసే పైపులు లీకవుతున్నా పట్టించు కోవటం లేదని విశాలాంధ్రలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో ప్రధాన మార్గం పక్కన, రెవెన్యూ కార్యాల యం ముందు లీకవుతున్న పైపులైన్లను సోమవారం మరమ్మతులు చేసి లీకేజీలను అరికట్టారు.

సచివాలయ నిర్మాణానికి చర్యలు

విశాలాంధ్ర - లింగపాలెం : టీసీహెచ్ఆర్ పాలెంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, గ్రామ ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణంపై వివాదం జరుగుతుండటంతో ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సోమవారం గ్రామంలో పర్యటించారు. ఈ కేంద్రాలకు భవనాలు మంజూరైనా నిర్మాణంలో వివాదం నెలకొంది. దీనిపై గ్రామంలో భిన్న అభిప్రాయాలు రావటంతో పునాదుల దశలో నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటి నిర్మాణపు వివాదం కోర్టులో ఉంది. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా సబ్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ విషయంపై తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఓ ఆశీర్వాదం, పంచాయతీరాజ్ ఎఇ జగన్నాధంతో సమావేశం నిర్వహించారు. అనంతరం వీరంతా గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తదుపరి చర్యల కోసం ప్రజల అభిప్రాయాలను కలెక్టర్‌కు నివేదిస్తామని సబ్ కలెక్టర్ వెల్లడించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాల యాల వారోత్సవాలలో నిర్వహించి పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ రెండు గ్రంథాలయాల నిర్వాహకులు లతీఫ్, వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు గ్రామాలకు చెందిన ఉన్నత పాఠశాల, చైతన్య, శ్రీవిద్య పాఠశాలల విద్యార్థులు, సహకార సంఘ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, సర్పంచ్ హేమలత, శ్రీవిద్యా పాఠశాల కరస్పాండెంట్ చలసాని రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ విధానం పరిశీలన

విశాలాంధ్ర - ముసునూరు: అతివృష్టి ,అనావృష్టి కారణాలతో వరి పంట దిగుబడి తగ్గినపుడు ప్రభుత్వం నుండి అందే నష్ట పరిహారం గ్రామం యూనిట్‌గా అందించా లన్న ఉద్దేశ్యంతో వరి పంటలో సీసీ విధానం పరిశీలిస్తున్నట్లు ముసునూరు తహశీల్దార్ దాసరి సుధ అన్నారు.సోమవారం మండలం లోని కోర్లగుంట గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె.చిన సూరిబాబు ఆధ్వర్యంలో వరి పంట సీసీ విధానం పరిశీలించారు.ఈ సందర్భం గా ఏఓ సూరిబాబు మాట్లాడుతూ గతంలో మండలం యూని ట్‌గా వున్నప్పుడు ఒక గ్రామంలో నష్టం వచ్చిన ఆ ప్రక్క గ్రామ ంలో నష్టం రాకపోతే రైతులకు నష్ట పరిహారం అందేది కాదనిప్రస్తుతం గ్రామం యూనిట్‌గా సీసీ విధానం చేయడం వల్లన రైతులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఎంపిఇఒలతో పాటు రైతులు కుడా వున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొయ్యలగూడెం గ్రామ శివారు గోపాలపురం రోడ్డులో టొబాకో బోర్డు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన బూరుగపల్లి శ్రీనివాసరావు(46) గోపాలపురం మండలం వేల చింతలగూడెం గ్రామం నుండి స్వగ్రామమైన దిప్పకాయలపాడు వెళ్లే మార్గంలో లారీ ఢీ కొనడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు, శ్రీనివాసరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

నిర్బంధ కాండ

- పర్యటన పేరుతో భారీ వృక్షాల తొలగింపు
- పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం

విశాలాంధ్ర - నర్సాపురం : ముఖ్యమంత్రి నరసాపురం పర్యటనలో నిర్బంధకాండ పర్యటన పేరుతో పట్టణంలోని ప్రజలను ఆంక్షలతో బయటకు బారికేడ్లు పెట్టి బయటకు రానివ్వకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. టిడిపి, జనసేన తో పాటు బిజెపి నాయకులను సైతం అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. ముఖ్యమంత్రి పర్యటన ఆద్యంతం అభద్రతాభావంలో ఉంటూ కర్ఫ్యూ వాతావరణం సృష్టించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు నాటండి ప్రాణాలు కాపాడండి అని మేధావులు,రాజకీయ నాయకులు తరచూ చెప్తూ ఉంటారు.కానీ పట్టణం లో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి పర్యటనలో కొట్టొచ్చినట్లు కనపడింది. సోమవారం జరిగిన ముఖ్యమంత్రి పర్యటన పేరుతో 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన భారీ వృక్షాలను అధికారులు తొలగించడం విమర్శలకు తావిచ్చింది.స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గల భారీ వృక్షాలు రోగి బంధువులకు కూర్చోవడానికి వీలుగా నీడనిచ్చేవని, ముఖ్యమంత్రి పర్యటన పేరుతో వృక్షాలను పూర్తిగా తొలగించడం వలన నిలువ నీడ లేకుండా పోయింది.

మత్స్యకారుల అభివృద్ధికి చేయూత

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారు లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లో సోమవారం పలువురు మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కు పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వై.ఎస్.ఆర్. మత్స్యభరోసా కింద 3 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. మత్స్యకారుల ఆర్థిక, జీవనస్థితిగతులు పూర్తిగా మెరుగుపడే చర్యలు ప్రభుత్వం తీసుకుందన్నారు. జిల్లాలో 239 మత్స్యకార సహకారాలు ఉండగా అందులో సుమారు 21 వేల 678 మంది సభ్యులు సభ్యత్వం కలిగియున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి. రాజేష్, భీమడోలు మండలం సాయన్నపాలెం మత్స్యకార సహకార సంఘం ప్రెసిడెంట్ అమృతరాజు పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన పడవద్దు
- జాయింట్ కలెక్టర్ పి అరుణ్ బాబు

విశాలాంధ్ర - ముదినేపల్లి : రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు చెప్పారు. ముదినేపల్లి మండలం వడాలి, చిగురుకోట రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, అక్కడ ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసి అరుణ్ బాబు మాట్లాడుతూ ప్రతీ రైతుకు సహాయం చేయడానికే ప్రభుత్వం ఉందన్నారు. రైతుల వద్ద నుండి నేరుగా కల్లాల వద్ద నుండే ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముదినేపల్లిలో మొత్తం 11 రైస్ మిల్లులు ఉండగా 5 రైస్ మిల్లుల వాళ్ళు బ్యాంకు గ్యారంటీ సమర్పించారన్నారు. 20 శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, పౌరసరఫరాలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర- మండవల్లి: రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి . అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మండ వల్లి మండలం కానుకొల్లు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, అక్కడ రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అరుణ్ బాబు మాట్లాడుతూ రైతుల కల్లాల నుండే ధాన్యాన్ని సేకరించాలన్నారు. రైతులు తెలియజేసే ప్రతీ సమస్యను పరిగణనలోనికి తీసుకుని, వారికి ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో ధాన్యాన్ని సేకరించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో యాప్ లో సాంకేతిక సమస్యలు నెలకొన్న సమయంలో ఆఫ్ లైన్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అధికారులను, సిబ్బందిని జేసీ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖాధికారి చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

మత్స్య సంపదను కాపాడుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: అంతరించిపోతున్న మత్స్య సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మత్స్య సంపద అంతరిస్తే జీవరాశి మనుగడకే ప్రమాదమని సి.పి.ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజ్ కుమార్ సింగ్ అన్నారు. డీఎన్నార్ కళాశా లలో సోమవారం అంతర్జాతీయ ఆక్వా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రపంచం జీవరాశికి ఆహారాన్ని సమకూర్చే మత్స్య సంపద ప్రధాన వనరన్నారు. అత్యాధునిక విధానాల ద్వారా ఈ పరిశ్రమను మరింత అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా పలు విద్యా సంస్థల విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మోడల్స్, పోస్టర్ ప్రజెంటేషన్ ను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ప్రిన్సిపాల్ జి.మోసెస్, ఎ.ఒ. పి.రామకృష్ణంరాజు, జువాలజీ శాఖాధిపతి డాక్టర్ కె. ఉషారాణి, ఆక్వాకల్చర్ శాఖ అధిపతి డాక్టర్ బి.పద్మజ, ఆయా విభాగాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ నేత శేషయ్య జీవితం ఆదర్శం

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టు ఉద్యమ ఆశయసాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నేత మద్ది శేషయ్య జీవితం అందరికీ ఆదర్శం కావాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు.సోమవారం దండగర్రలో సీపీఐ తొలితరం నాయకుడు మద్ది శేషయ్య 32 వ వర్థంతి సీపీఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామంలో మద్ది శేషయ్య స్మారక స్థూపం వద్ద శేషయ్య చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం తాలూకాలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి శేషయ్య ఎనలేని కృషి చేశారన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అణగారిన వర్గాల అభ్యున్నతికి, రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. సీపీఐ నాయకుడు కర్రి సోమేశ్వర రావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్,కళింగ లక్ష్మణరావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పార్టీ ఏరియా కన్వీనర్ మండల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు బి.లక్ష్మీనారాయణ,యు.జయకృష్ణ మద్ది రామకృష్ణ,రాలీ ఉమామహేశ్వరరావు, మద్ది బ్రహ్మయ్య, మద్ది సూర్య నారాయణ రావు,గెద్దా సురేష్ కుమార్,బందెల తిరుపతయ్య, మద్ది సుబ్బారావు, అల్లం రాము, మేరి తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మికుల చలో రాజమండ్రి జయప్రదం చేయండి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : రాజమండ్రిలో ఈనెల 26 న జరగనున్న భవననిర్మాణ కార్మికుల మహా ప్రదర్శన జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపు ఇచ్చారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్ ,రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం సోమవారం సిపాయిపేట లోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.జాతీయ మహాసభ సందర్భంగా తాడేపల్లిగూడెంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని సమావేశంలో సమీక్షించారు. పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ గత వారంరోజులుగా తాడేపల్లిగూడెం పట్టణంలో కార్మికుల మకాముల వద్ద చేపట్టిన ప్రచారం విజయవంతంగా జరిగిందన్నారు. వందలాది మంది కార్మికులు సమావేశాల్లో పాల్గొన్నారని, వారికి సమస్యలపైన, మహాసభలపై అవగాహన కల్పించామని తెలిపారు. భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కూడా మహాసభ ప్రచారం విజయవంతంగా జరుగుతోందని అన్నారు. ఏఐటీయుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ మాట్లాడుతూ ఇకనుండి ర్యాలీకి జనసమీకరణపై దృష్టి సారించాలని , మకాముల వారీగా ఎంతమంది హాజరయ్యేదీ మేస్త్రీల ద్వారా సమాచారం తీసుకుని ఆమేరకు వాహనాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఏఐటీయుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ యూనియన్ చేపట్టిన ప్రచారానికి మంచి స్పందన లభించిందన్నారు. యూనియన్ ను మరింత పటిష్టం చేయాలని కోరారు.యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంకం భాస్కరరావు, జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్, ఏరియా ప్రధానకార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి కాకర్ల రాంబాబు, యూనియన్ నాయకులు రెడ్డి శ్రీనివాస్, చల్లా శ్రీనివాస్ ,రామిసెట్టి శ్రీనివాస్, గాది బాలాజీ,రామిసెట్టి సత్తిబాబు, పంతం రాంబాబు ,పాలూరు రాంబాబు, కోడె సాయిబాలాజీ , పిల్లంగోళ్ళ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర- కామవరపుకోట : తడికలపూడి రెవిన్యూ పరిధిలోని భూముల్లో సుదీర్ఘకాలం సాగు చేసుకుంటున్న వారిని గుర్తించి పట్టాలిచ్చి వారికి యాజమాన్యం హక్కు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో కే శ్రీదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబం ఇంటిపెద్దకు ఇచ్చిన పట్టా భూమిని అన్నదమ్ములకు ఇవ్వాలని తడికలపూడి రెవెన్యూ పరిధిలో గల రత్నగిరి నగర్ లో సుదీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు.దశాబ్దాలు వ్రతం మెట్ట భూమిగా ఎత్తు పొలాలుగా ఉన్న భూమిని చదును చేసి నివాస స్థలాలుగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలక వెంకటరత్నం, చిలకా పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆయాల బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర- ఏలూరు : లింగపాలెం మండలంలో పాఠశాల ఆయాలకు బకాయిలు ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు, బుచ్చిబాబులు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2020 మార్చి వరకు జీతాలు చెల్లించారని, లింగపాలెం మండలానికి మాత్రం చెల్లించ లేదన్నారు. లింగపాలెం మండలంలో 70 పాఠశాలలో ఆయాలు పనిచేస్తున్నారని, బకాయి పడ్డ జీతాల కోసం 2021 జూన్ లో అప్పటి విద్యాశాఖ అధికారిని కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి స్పందిస్తూ జిల్లాలో 154 పాఠశాలలకు జీతాలు చెల్లించాల్సి ఉందని దీనిలో లింగపాలెం మండలానికి పూర్తిగా చెల్లించాలని, ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.జయలక్ష్మి, శిరోమణి, రాణి, పైడమ్మ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముట్లకోనేరు చెరువులో ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - ఏలూరు : నగరపాలక సంస్థకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలు స్మశాన వాటికలు పార్కులు ఆక్రమించుకున్న ఆక్రమణదారులపై ప్రభుత్వ పరంగా కఠినమైన చర్యలు తీసుకుని ఆక్రమించుకున్న స్థలాలను స్వాధీనం చేసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక 48వ డివిజన్లోని ముట్ల కోనేరు చెరువు శ్మశాన వాటికలను ఆక్రమించుకొని నిర్మించుకున్న నిర్మాణాలను ప్రజల సౌకర్యార్థం ఆక్రమణలను టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ ,రెవెన్యూ అధికారులతో కలిసి తొలగించారు. శ్మశాన వాటికలు చెరువులు ఆక్రమించుకుని వాటి స్థలాలను కబ్జా చేశారని స్థానికుల ఆరోపణలు ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ అధికారులు అనధికార నిర్మాణాలు తొలగించామని తెలిపారు.

23న సీపీఐ ఏలూరు జిల్లా సమితి విస్తృత సమావేశం

విశాలాంధ్ర - ఏలూరు : ఈనెల 23న ఉదయం గం.10లకు జంగారెడ్డిగూడెం ఆర్.డి.ఒ కార్యాలయం సమీపంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో సీపీఐ ఏలూరు జిల్లా సమితి విస్తృత సమావేశం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, దేగా ప్రభాకర్ హాజరవుతారన్నారు. రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్ణయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, జిల్లాలో ఉన్న పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం తదితర అంశాలు, సమావేశంలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు.జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు,మండల కార్యదర్శులు, శాఖా కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

తలకు హెల్మెట్ రక్షణ కవచం

విశాలాంధ్ర-టి.నరసాపురం: తలకు హెల్మెట్ రక్షణ కవచంలా పనిచేస్తుందని ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లలో వాహనదారులకు సోమవారం హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం సంభవిస్తుందని తెలిపారు. వాహనాలపై ప్రమాదాలు ఎక్కువ శాతం హెల్మెట్ ధరించక పోవడం వలన జరుగుతున్నాయని తెలిపారు. మీతో పాటు మీ తోటి వారికి హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలు తెలియజేయాలని అన్నారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా మీ గమ్యాన్ని చేరండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేతవరం విద్యార్థిని

విశాలాంధ్ర-టి.నరసాపురం: కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పెసనగంటి మధు లావణ్య రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గాదిరాజు రామ రాజు తెలిపారు. స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మధు లావణ్య కు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామరాజు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో మధు లావణ్య ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మధు లావణ్య కు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ జి. రమేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బర్రె రమేష్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయపూడికి ఉపాధ్యాయరత్న పురస్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కుంతలగూడెం ఎంపియూపీ స్కూల్ ఉపాధ్యాయుడు రాయపూడి వెంకట రమణకు ఉపాధ్యాయ రత్న పురస్కారం దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టరు జి.చంద్రయ్య చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్టు రాయపూడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 17వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రతిభను కనబరుస్తున్న 50మందిని గుర్తించి ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో జస్టిస్ ఎస్.నందా కూడా పాల్గొన్నారని తెలిపారు. ఉపాధ్యాయ రత్న పురస్కారం అందుకున్న సంద ర్భంలో రాయపూడిని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, యుటిఎఫ్ నాయకులు, తదితరులు అభినందించారు.

శ్రీ చైతన్యలో ఇంగ్లీష్ క్లబ్ కార్యక్రమం

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ క్లబ్బులో భాగంగా లెవెల్ 1 కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనికేషన్ నైపుణ్యం అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. లెవెల్ వన్ లో భాగంగా పాఠశాలలోని ప్రతి తరగతి లోని విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి ఆంగ్ల భాష పై ప్రశ్నలు వేస్తూ విద్యార్థులతో మాట్లాడిస్తారని తెలిపారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రము బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమరభేరి ర్యాలీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఏలూరు : ఈనెల 24వ తేదీన తిరుపతిలో జరుగు దళితుల సమరభేరీ ర్యాలీని విజయవంతం చేయాలని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దళితులపై దాడులు హత్యలు, అత్యాచారాలు, నిత్యం జరుగుతున్న దమన కాండపై దళితులంతా ఐకమత్యంగా ఈ దుర్మార్గ ప్రభుత్వ మొండి వైఖరి ఖండిస్తూ, దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ని గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. టిడిపి ఎస్‌సి రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న దళితుల సమరభేరీ ర్యాలీలో ఎస్ సి సెల్ విభాగం నందు వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర కమిటీ, పార్లమెంటు, అసెంబ్లీ, మండల ఎస్ సి సెల్ ఇతర అనుబంధ కమిటీ సభ్యులు అందరూ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలం బోడి గూడెం సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న పి. దుర్గా ప్రశాంతి రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు తీసివేయడంతో కొయ్యలగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను కొయ్యలగూడెం మండల మానవతా సంస్థ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్క బాబి, తిర్నతి సిద్ధార్థ, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, చిటికెన భీమరాజు, జేష్ట రామకృష్ణ, కొనకళ్ల రాంబాబు, చింతపల్లి సురేష్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఏ. గోకవరంలో సోమవారం రైతు ఈదర సుధీర్ కొండయ్య వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట పొలంలో 5.5 మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగం నిర్వహించారు. 22.95 కిలోల దిగుబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ, మండలం వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, వీఆర్వో, విఏఏ , రైతులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో గిరిజనుల అభివృద్ధి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : చేపల పెంపకం ద్వారా గిరిజనుల జీవనాభివృద్ధికి మేలు చేకూరుతుందని ఫిషరీష్ ఇన్‌చార్జి, డిప్యూటీ డైరెక్టర్ బి.నరసయ్య అన్నారు. సోమవారం మండలంలోని పోగొండ రిజర్వాయర్ లో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల పెంపకం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

జిల్లాలో 1300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలంలో ఇంతవరకు 1300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు జిల్లా పరిషత్ సీఈఓ, ధాన్యం కొనుగోలు కేంద్రాల మండల ప్రత్యేక అధికారి కె. రవి కుమార్ చెప్పారు. సోమవారం గణపవరం మండలంలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలను పర్యవేక్షించారు. రైతులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ రవికుమార్ మాట్లాడుతూ ఇంతవరకు ఆన్లైన్, ఆఫ్ లైన్ లో 1300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లులకు తరలించామన్నారు. మండలంలో గొనె సంచుల కొరత లేదని, ప్రస్తుతం 74 వేల 200 గొనె సంచులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. సీఈవో వెంట తహసీల్దార్ ఎం. సన్యాసిరావు, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ , వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : ప్రజలకు నిత్యం ఉపయోగపడే పబ్లిక్ పార్కులు,ఆసుపత్రులు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) అపూర్వ భరత్ అధికారులకు సూచించారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పార్కు లు,డంపింగ్ యార్డ్ లను ఆయన సోమవారం పరిలిశీలించారు.అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రి లోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగుల వార్డులలో కి వెళ్లి వైద్య సదుపాయాలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం ఉపయోగపడే ఆసుపత్రులు,పబ్లిక్ పార్కులు,డంపింగ్ యార్డులు, డ్రైనేజీలు మొదలైనవి పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రి కి వచ్చే రోగులకు తగిన సౌకర్యాలను అందించాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ కే.స్లీవ జోజి,ఆర్. ఐ.రమేష్,మున్సిపల్ శాఖ ఏఈ సంధ్య,ఆసుపత్రి పర్యవేక్షకులు బేబి కమల,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రాపోలు బావన రుషి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో ఎల్‌బిసి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఏలూరులో జరిగిన జిల్లా గ్రంథాలయంలో, బాలల గ్రంథాలయంలో వివిధ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక పడమర వీధిలో ఉన్న లిటిల్ బర్డ్స్ స్కూల్ విద్యార్థులు అత్యధిక ప్రతిభను కనపరిచి రెండు గ్రంథాలయాల్లో బహుమతులు సాధించారు. క్విజ్‌లో ప్రథమ స్థానం ఎస్.విఙ్ఞానేశ్వర్, ఎ. తేజస్విని, మనోహర్, గీతా లాపనలో ప్రథమ స్థానం బి. గీతిక, చిత్రలేఖనంలో ప్రథమ స్థానం పి. అనిత, బి. గీతిక, బి. నవ్య, కన్సోలేషన్ వి. సాయి లోకేష్, తృతీయ స్థానం రోహిత్ దుర్గా, వ్యాసరచనలో ద్వితీయ స్థానం కెపీఎస్ నాగేంద్ర, కన్సోలేషన్ ఎస్. సత్య రోహిత్, చెస్‌లో ద్వితీయ స్థానం బి. గనేశ్వర్, జానపద నృత్యంలో ద్వితీయ స్థానం కె. మోక్షిక, వి. మాన్వత, కే మౌనిక, పద్య పఠనం లో ద్వితీయ స్థానం పి. నవ్య, తృతీయ స్థానం డి. దివ్య బహుమతులు సాధించారు. సాధించిన విద్యార్థులు పాఠశాల డైరెక్టర్స్ వై ఆర్ కిషోర్, ఎం శ్రీనివాసరావు, జి. సత్యనారాయణ, ఎం. కుమార్ అభినందించారు.

శాసనాధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

విశాలాంధ్ర - కలిదిండి: శెట్టిబలిజలకు శాసనాధికారమే లక్ష్యంగా పనిచేస్తానని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడిపూడి. సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మూలలంక గ్రామంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శెట్టిబలిజ సంఘం వన సమారాధన కార్యక్రమాన్ని సంఘం నాయకులు బండి తులసీరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 6 శాతం జనాభా కలిగి ఉన్నప్పటికీ అదే స్థాయిలో గుర్తింపు లభించడం లేదన్నారు. శెట్టిబలిజల వెనుకబాటుతనాన్ని పోగొట్టి ఉన్నత స్థితికి చేర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు కోడే దుర్గారావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వీరవల్లి. వెంకటేశ్వరరావు, పంపన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, శ్యామల దంపతుల కుమార్తె వివాహ ఉత్సవంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని నూతన వధూవరులైన ప్రియాంక, డేనియల్ మోజెస్‌లను ఆశీర్వదించారు. ధర్మాజీ గూడెంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మద్దాల రాజేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

హెల్మెట్ ధరించండి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుండి ప్రాణాలు కాపాడు కోవాలని బుట్టాయిగూడెం ఎస్ఐ ఎం. జయబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన సిబ్బందితో వాహన దారులకు హెల్మెట్‌పై అవగాహన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రాణాలకు ముప్పని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి తోటి ప్రయాణికులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.

ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు సరే

- పనులు పూర్తిచేసే దమ్ముందా

విశాలాంధ్ర - పాలకొల్లు : ముఖ్యమంత్రి జగన్‌కు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించే నైతిక హక్కు లేదని పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. సోమవారం నరసాపురం టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కు పసుపు రంగు అంటేనే భయం అనుకున్నామని నలుపు రంగు అన్నా కూడా భయమేనని అర్థమవుతుందన్నారు. ఎందుకంటే నలుపు రంగు చున్నీలు వేసుకున్న మహిళలను, నల్ల గొడుగులను నరసాపురం బహిరంగ సభలోకి అనుమతించ లేదన్నారు. సోమవారం రూ. 3,800 కోట్లతో నరసాపురం నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన 13 పనుల్లో ఒక్క పనికి కూడా టెండర్లు పిలవలేదని, ప్రజలను మాయ పెట్టడానికి మభ్యపెట్టడానికి మాత్రమే హామీలు గుప్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. శంకుస్థాపన చేసిన 13 పనులను సంవత్సరంలో పూర్తి చేస్తానంటూ లిఖితపూర్వకంగా హామీ ఇవ్వగల దమ్ము ముఖ్యమంత్రి జగన్ కు వుందా అని ఎమ్మెల్యే నిమ్మల ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్ పై వచ్చారని, రోడ్డు మార్గంలో వచ్చుంటే రహదారుల దుస్థితి తెలిసి ఉండేదన్నారు.

ఆసుపత్రిలో భోజన శాల ప్రారంభం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: మండలం లోని లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లక్కవరం మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వర రావు ఆర్థిక సహాయం తో ఆయన భార్య మట్టా వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం రూ. 3లక్షల 50వేలతో మదర్ థెరిస్సా భోజనశాలను నిర్మించారు. ఈ భోజనశాల ను సోమవారం రోటరీ క్లబ్ అధ్యక్షులు దాకారపు కృష్ణ ,ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకటరమణ లున్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ భవనానికి ప్రశాంతి నిలయం అని పేరు పెట్టారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదో ఒకటి చేయాలనే కోరిక తో నిత్యం లక్కవరం గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా మట్టా వెంకటేశ్వరరావు చేస్తున్న సేవలు మరువలేనిదన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి ,సర్పంచ్ గెల్లా వెంకటరమణ మాట్లాడుతూ లక్కవరం గ్రామంలో ఎవరు చేయలేని కార్యక్రమాలు నేటికీ తన సొంత డబ్బుతో చేస్తున్న మంచి వ్యక్తి మట్టా వెంకటేశ్వరవు అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, డాక్టర్ అశోక్ కుమార్, అస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

విశాలాంధ్ర - గణపవరం: గణప వరం మండలం కొత్తపల్లి గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించి గ్రామంలో పెద్దలను కలిసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను,జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలే లేకుండా అణచివేతకు గురి చేస్తున్న పవన్ కళ్యాణ్ ధైర్యంగా ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తూ 2024 సార్వత్రిక ఎలక్షన్లో రాజ్యాధికారమే దిశగా పనిచేస్తు న్నారని అలాంటి నిజాయితీ గల నాయకుడికి ప్రజలు కూడా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీని ఆదరించాలని ప్రజలకు వివరించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొత్తూరి కృష్ణం రాజు, తోట పవన్, కొమ్మోజు వెంకట్, నాయుడు ప్రభాకర్, అలుమోలు రాంచరణ్ వీర మహిళ నిమ్మల మౌనిక, ఐ.టి కో ఆర్డినేటర్ అయితం ప్రసాద్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షులు మద్దాల లక్ష్మీ రమేష్, కార్యదర్శులు వంగా నరేష్, మద్దాల సురేష్, లింగం కాశీ, మద్దాల సాయి చరణ్, మద్దాల గోపి, చిరంజీవి సతీష్, సిద్ధంశెట్టి చంటి జనసేన జనసైనికులు పాల్గొన్నారు.

నేడు తాడేపల్లిగూడెంలో దేవంగ సంక్షేమ సంఘం వనభోజనాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు:ఉమా రామలింగేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం కొండలమ్మ గుడి, సిహెచ్ వేణుగోపాలస్వామి తోటలో కార్తీక వన భోజనాలు జరుగుతా యని రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌర అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. కార్తీక వనభోజనాల కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఉంగుటూరులో ఆవిష్కరించారు. తాడేపల్లిగూడెం స్వామి టైలర్స్, సోనం టైలర్స్, అల్లాడి సత్యనారాయణ, ముప్పన సత్యనారాయణలు, కొండపల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నాచు గుంట గోశాలలో సోమవారం కార్తీక వనభోజనాలు వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల నుండి మూడువేల పైనే భక్తులు తరలి రావడంతో వన భోజన కార్యక్రమం కిటకిటలాడింది. శ్రీ గోపాలకృష్ణ గోశాల సభ్యులు కార్తీక వనభోజనం కార్యక్రమంలో తన ఏర్పాట్లు చేశారు. తొలుత గోపూజ కార్యక్రమం, హెూమాలు నిర్వహించారు. ఉంగుటూరు భద్రకాళి తోటలో కొల్లి భవాని ఆధ్వర్యంలో ఉంగుటూరు మండల టిప్‌టాప్ యజమాల సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భద్రకాళి సేవాదళ్ చైర్మన్ పాతూరు వంశీకృష్ణ పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల సందడి

విశాలాంధ్ర - వీరవాసరం : వీరవాసరంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాలన్నీ తెల్లవారుజాము నుండి శివనామ స్మరణతో మారు మ్రోగాయి. వీరవాసరంలోని శ్రీ వీరేశ్వర, విశ్వేశ్వర, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. పూజల నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ కందుల సురేష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వీరవాసరం గ్రామానికి చెందిన ముద్దాల వెంకట రెడ్డినాయుడు బ్రదర్స్ దంపతులచే లక్షపత్రి పూజ, అనంతరం సహస్ర జ్యోతిర్లింగార్చన పూజలు ఆలయ అర్చకులు కొడమంచిలి నాగేశ్వరరావు, చేబ్రోలు ఉమామహేశ్వరరావు లచే అత్యంత వైభవోపేతంగా జరిగాయి. కార్యక్రమాలలో ఆలయ అర్చకులు కొడమంచిలి దుర్గాప్రసాద్, రాంబాబు, భక్తులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత నాయకులను అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర - ఉండి : ముఖ్యమంత్రి జగన్ నరసాపురం పర్యటన నేపథ్యంలో సోమవారం తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరి నాయుడు, నియోజకవర్గంలోని తెలుగు యువతను సమీకరించి నరసాపురంలో ముఖ్యమంత్రి పర్యటనకు నిరసన తెలిపిన నేపథ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చెన్నంశెట్టి హరినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసపూరిత హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి జగన్ ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసాపురం పర్యటనలో ఉన్న జగన్ కి నిరసన తెలపడానికి వెళ్లిన తమను పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తుల్లాగా మారారని, అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదన్న విషయం పోలీసులు గుర్తుంచుకోవా లని సూచించారు. తెలుగు యువత పోరాడేది నిరుద్యోగులు యువత భవిష్యత్ కోసమేనని ఆయన తెలిపారు.

నాడు నేడు తో పాఠశాలలు అభివృద్ధి

విశాలాంధ్ర - కలిదిండి : నాడు - నేడు పథకం తో ప్రభుత్వ పాటశాలల రూపు రేఖలనే మార్చేస్తుందని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని గుర్వాయి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాడు, 10 కంపోనెంట్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శిలా ఫలకం ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.నాడు నేడు పథకం ద్వారా గుర్వాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు 6 అదనపు తరగతి గదులకు రూ.72 లక్షలు,10 కాంపోనెంట్స్ కోసం 42 లక్షలు మంజూరయ్యాయని ఈ నిధులతో పాఠశాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుసనబోయిన. ప్రసన్న కుమారి, విద్యా కమిటీ చైర్మన్ గూట్ల సునీత అతిథులకు దుశ్శాలువలు వేసి పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

విశాలాంధ్ర - కాకినాడ : ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని అనేక పోటీలు నిర్వహించారు. ఈ వారోత్స వాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మానికిరెడ్డి హెల్త్‌కేర్ ఫౌండేషన్ చైర్మన్ మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందుతున్న ప్పటికి గ్రంథాలయాల ప్రాధాన్యత ఎప్పటికి అలాగే ఉంటుందని, భవిష్యత్ తరాలకు విజ్ఞాన సమాచారాన్ని అందించడానికి గ్రంథాలయా లను పరిరక్షించాలని తెలిపారు. ఆ కార్యక్రమనికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాలలో విజ్ఞాన సంపన్న ఖనిజాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిలో ఉన్న జ్ఞాన సాగరాన్ని మదించి విజ్ఞానవంతులైన దేశ ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ గ్రంథాలయాలు పఠనాశక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య స్కూలు ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి.బ్యులా మాట్లాడుతూ పుస్తకాలు మంచి స్నేహితులుగా ఉపయోగపడతాయని సంస్కృతి సంప్రదాయలను శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన అభివృద్ధి పరిరక్షిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య స్కూలు ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ పి.రమేష్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల చీఫ్ లైబ్రేరియన్ డా.ఎస్.వి.ఆర్.ప్రభాకర్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభి వృద్ధి ద్వారా వెదజల్లుతుందని, సమగ్ర సమాచారం అందించడంలో గ్రంథాలయాలు వారధులని వాటిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి లైబ్రేరియన్స్ కె. సూర్యనారాయణ, నేరేళ్ళ రెడ్డి, ఎస్. మంజులారాణి, పోలారావు, మాధవి, విజయలక్ష్మి, సత్యనారాయణ, బాలాజీ విజయవంతంగా నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న వివిధ కాలేజీల విద్యార్థినీ విద్యార్థులను, వారిని ప్రోత్సహించి పంపించిన వివిధ జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు

విశాలాంధ్ర - సామర్లకోట : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేట్లపాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధి కారి పి.విమలాదేవి ఆధ్వర్యంలో సోమవారం 55వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ వారం రోజులుగా వారోత్సవాలు నిర్వహించి వివిధ విభాగాలలో విద్యార్థిని విద్యార్థులకు పోటీల నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి అనురాధ విచ్చేసి విజేతలకు బహుమతి ప్రదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి శివకుమారి, కే భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతా పారాయణం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్థానిక సత్యనారాయణ స్వామి వారి దేవాలయంలో భగవద్గీత పారాయణం చేయించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు అలమండ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవచ్చు అన్నారు. డిసెంబర్ మూడో తేదీన మండలంలోని ఎర్రవరం గ్రామంలో గీతా జయంతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గీతా పారాయణం పై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించుచున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కటకం కిరీటి, నడిమింటి తిరుపతిరావు, రాతి కింద వెంకట కృష్ణారావు, సి చంద్రరావు తదితరులు ఉన్నారు.

ములగపూడిలో వన సమారాధన

విశాలాంధ్ర - రౌతులపూడి : కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ములకపూడి గ్రామ సర్పంచ్ తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వరుకుల రాజ్య విచ్చేసి పలువురిని ఆత్మీయంగా పలకరించారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న గ్రామ సర్పంచ్ తమరాల సత్యనారాయణను రాజా అభినందించారు. రౌతులపూడి మాజీ ఎంపీపీ అటంశెట్టి సూర్య భాస్కర్ బాబు, సోమరావుతో మౌళి, దిగువశివాడ మాజీ సర్పంచ్ పంచాడ బుజ్జి, రౌతులపూడి మాజీ సర్పంచ్ పైలా సాంబశివరావు, మండలంలోని ఇతర నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సహాయం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : పైడిమెట్టలో ఇటీవల హై టెన్షన్ వైర్ల తాకిడి వలన విద్యుత్ షాక్ కు గురై కాకినాడలో చికిత్స పొందుతూ రెండు కాళ్ళు పోగొట్టుకున్న మూడు సంవత్సరాల బాలుడి సమాచారం తెలుసుకున్న వెంటనే విషయాన్ని తాళ్లపూడి మండలంతో బాటు జిల్లాలోని ఉపాధ్యాయులకు వాట్స్ ఆప్ ద్వారా తెలియజేసి ఆర్థిక సాయం అందించుటకు జిల్లా అధ్యకులు దున్నా దుర్గారావు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు డిడి రావు అకౌంట్ కు చేరిన 46 వేల రూపాయలు జొన్న కూటి దర్షిత్ ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇలాంటి ప్రమాదాలు మరోసారి జరగకుండా వెంటనే హై టెన్షన్ తీగలను తొలగించాలని సామాజిక బాధ్యతగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డిడి రావుతో జిల్లా కార్యదర్శి ఎస్ రాజశేఖర్, తాళ్లపూడి మండల ఉపాధ్యక్షుడు రాజారత్నం, ప్రధాన కార్యదర్శి శోభన్ బాబు, జిల్లా కౌన్సిలర్ నాని, గోపాలపురం కార్యదర్శి మునేశ్వర రావు ఉన్నారు.

విద్యార్థి దశ నుండే మానవీయ విలువలు తెలుసుకోవాలి

విశాలాంధ్ర- తణుకు : మానవీయ విలువలు నేర్చు కోవడం, తెలుసుకోవడం, ఆచరించడం విద్యార్థిదశ నుండే అలవాటు చేసుకోవాలని ఎస్. కెఎస్.డి మహిళా కళాశాల ఫౌండర్ సెక్రటరీ, కరెస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్యవాల ముగింపు సందర్భంగా సోమవారం కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు విశిష్ట అతిథిగా ఉషారాణి మాట్లాడారు.సాంకేతిక విజ్ఞానాన్ని దుర్వినియోగం చేసుకోకూడదని, విజ్ఞానాభివృద్ధికి వినియోగించుకోవాలని చెప్పారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఉషారాణి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హరనాథ్, ఉప గ్రంథాలయాధికారి కుమారి శీల గీతాకుమారి, డి. స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మత్స్యకారుల దినోత్సవం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడిలో అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి వైకాపా నాయకులు, బీసీ నాయకులు నక్కా చిట్టిబాబు, వైకాపా నాయకులు గూడా విజయరాజు, మల్లికా భద్రరావుల సమక్షం లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులంతా ఒకే తాటిపై ఐకమత్యంతో ఉండాలని కోరారు. అనంతరం తమ కులస్తులకు అగ్నికుల క్షత్రియులు అని కుల ధృవీకరణపత్రాల మీద వచ్చేలా చర్యలు తీసుకోవాలని, తమ నివాసాలు వద్ద గల ఖాళీ స్థలం లో కమ్యూనిటీ హాల్ కట్టాలని కోరారు. అగ్నికులక్షత్రియ యువకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : 55వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన తమ పాఠశాల విద్యార్థులను శ్రీ విజేత హైస్కూల్ కరస్పాండెంట్ మోపిదేవి విజయ లక్ష్మి అభినం దించారు. సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జొన్నకూటి వెంకట ప్రమోద్ కుమార్ గ్రంథాలయ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటువంటి పోటీలలో పాల్గొని తమ మేధస్సుకు పదును పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సి వి రామన్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులు కె.వెంకట్, ఎం. కరుణలను శాలువాతో సన్మానించి పూల మొక్కలను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, అనిత, గంగారత్నం, ప్రవల్లిక, దేవి, సలోమి పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - అంబాజీపేట : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములలో భాగంగా శాఖ గ్రంథాలయం అంబాజీపేటలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు విచ్చేసి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినం దించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీ భార్గవి రాము, సొసైటీ చైర్ పర్సన్ కొర్లపాటి కోటబాబు, మద్దింశెట్టి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అరిగెల బలరామూర్తి, మాకే దేవి ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ మాదిగ, మాదిగ ఉపకులాల కార్తీక వన సమారాధన ఆత్మీయ సమావేశం సోమవారం నడిపూడి బాబు జగ్జీవన్ రావ్ భవన్‌లో జరిగింది. ఈ సభ సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గంపల సత్యప్రసాద్ మాదిగ ప్రారంభించగా, సభా అధ్యక్షుడు చుట్టుగుల్ల నీలకం మాదిగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య ఆహ్వానితులుగా కుడుపూడి సూర్యనారాయణరావు, కల్వకోలను తాతాజీ, గంధం పల్లంరాజు, మోకా వెంకట సుబ్బారావు, మంతెన రవిరాజు, కొమ్మల కొండలరావు, నవ్వుంద్రు సంజీవరావు, దూరి రాజేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి 3000 మంది మాదిగలు ఈ వన సమారాధన హాజరయ్యారని నాయకులు చెప్పారు.

కోడెల కుటుంబానికి నవీన్ పరామర్శ

విశాలాంధ్ర - కిర్లంపూడి : మాజీ ఎంపీపీ కోడెల సావిత్రి నల్లబ్బాయి కుటుంబానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ ఆదివారం పరామర్శించారు. నల్లబ్బాయి సోదరుడు కోడేల గణేశ్వరరావు (తాత) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కాకినాడలో నివాసముంటున్న తోట నవీన్ విషయం తెలుసుకుని ఆదివారం నల్లబ్బాయి, తాత కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆదారి నానాజీ, అడపా ఏడుకొండలు, లక్కోజు కోటి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎన్ఎంను పరామర్శించిన డిఎంహెచ్ఓ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలం అంకాల గూడెం గ్రామానికి చెందిన పి. దుర్గ ప్రశాంతి బోడిగూడెం సచివాల యంలో ఏఎన్ఎం గా పనిచేస్తూ శు క్రవారం ఉదయం స్కూటీపై విధులకు వెళ్లే మార్గంలో ఆమెను అంకాల గూడెం గ్రామంలో లారీ ఢీకొనడంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. కొయ్యలగూడెం లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఏలూరు జిల్లా డిఎం అండ్ హెచ్ఓ రవి సోమవారం పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా రావలసిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కొంతకాలం తరువాత రెండు కాళ్లకు కృత్రిమ కాళ్లు ఏర్పరచుకోవచ్చని ధైర్యంగా ఉండాలని ఆమెకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. పరిస్థితిని ఉన్నత అధికారులకు తెలియజేస్తామని ఆయన అన్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆర్థోపెడిక్ డాక్టర్ రాజశేఖర్ కు తెలిపారు. అనంతరం కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈయన వెంట కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

పది లీటర్ల నాటు సారాతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-చాగల్లు : మండల కేంద్రం చాగల్లు గ్రామంలో కొవ్వూరు ఎస్ఇబి వారు సోమవారం చేసిన దాడులలో గ్రామానికి చెందిన కోడి చిన్న రాజు తండ్రి ముసలయ్య అనే వ్యక్తి ని 10 లీటర్ల నాటు సారా తో అరెస్టు చేసి అతనిని రిమాండ్ కి పంపినట్లు ఎస్సీబి .సీఐ సత్యనారాయణ తెలిపారు. మరియు ఒక పాత ముద్దాయిని కొవ్వూరు తహసీల్దార్ వారి ముందు మరియు ఎనిమిది మంది పాత ముద్దాయిలను నిడదవోలు తహసీల్దార్ వారి ముందు బైండోవర్ చేశామని తెలిపారు.ఈ దాడులలో ఎస్సై బహంతి సుధీర్ గౌరీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - దేవరపల్లి : సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గౌరీపట్నం గ్రామంలో సోమవారం నిర్వహించారు. గ్రామాలలో ఉన్న అంబేద్కర్, బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్. అన్నపూర్ణ, ఉప సర్పంచ్ ఎ. రమేష్ బాబు, వైస్ ఎంపీపీ అరుణ ,సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు, కొర్లపాటి సుబ్రహ్మణ్యం, తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో కే ఉమామహేశ్వర శర్మ, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.